క్లుప్తంగా

బీఆర్‌ఎస్వీ సమావేశానికి జిల్లా నాయకులు


సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్వీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌ అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి సమావేశానికి జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి కేటీఆర్‌ హాజరై శ్రేణులకు రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని, ప్రతి ఒక్కరికి పార్టీలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు భరద్వాజ, ఇర్ఫాన్‌, సాయి, వసీం పాల్గొన్నారు.

'నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్‌'

నార్నూర్‌: నిరుద్యోగులను మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ జిల్లా నాయకుడు భిక్షపతి రాథోడ్‌ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో లక్ష ఉద్యోగాలతో పాటు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేశాడని ఆరోపించారు. మళ్లీ ఓట్లు అడిగేందుకు వస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులను నిలదీయలన్నారు. ఉద్యోగాలు రాక యువత ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. బీఆర్‌ఎస్‌ను ఓడించి బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ధర్మరక్షక్‌, శ్రీను, శ్రావణ్‌, మహేశ్‌, కిరణ్‌ పాల్గొన్నారు.

ఓటు స్ఫూర్తి.. ప్రజాస్వామ్య దీప్తి

దండేపల్లి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్‌ శాతాన్ని పెంచేందుకు, భారత ఎన్నికల సంఘం అధికారులు ఓటు హక్కుపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. ఓటు హక్కు బాధ్యతను తెలియజేసేందుకు జిల్లా ఎన్నికల అధికారులు గ్రామాల కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఓటుహక్కు వినియోగంపై వినూత్న ప్రచారం నిర్వహిస్తున్నారు. 'ఉజ్వల భవిష్యత్‌కు ఓటు మీ హక్కు' నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను.. అంటూ ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి'

మంచిర్యాలటౌన్‌: వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని, బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌ సతీమణి స్రవంతి అన్నారు. జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడ, ఏ క్యాబిన్‌ ఏరియాలో ఆదివారం బీజేపీ తరుపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంచిర్యాల పట్టణం అభివృద్ధి కేవలం రఘునాథ్‌ను గెలిపిస్తేనే సాధ్యమని ప్రజలకు వివరించారు.

'అందుబాటులో ఉండి సేవ చేస్తా'


కార్యకర్తలతో ప్రచారంలో రమేశ్‌

జన్నారం: ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని, మండలంలోని సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేయాలని మాజీ ఎంపీ, బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి రాథోడ్‌ రమేశ్‌ పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపూర్‌, రాంపూర్‌ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రధాని నరెంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి మద్దతు తెలుపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోలి చందు, శంకరయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కాసిపేట: మండల కేంద్రంలో ఆదివారం బెల్లంపల్లి కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం వినోద్‌ ఆధ్వర్యంలో మాజీ బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకుడు పుర్ర కుమారస్వామి యాదవ్‌ 100మంది యువకులతో కాంగ్రెస్‌లో చేరగా, వారికి వినోద్‌ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్‌, మాజీ మండలాధ్యక్షుడు సిద్దం తిరుపతి, మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ రాంచందర్‌, నాయకులు రాజమౌళి, రమేష్‌, స్వామి, వెంకటేష్‌, శంకర్‌, పుర్ర పోశం, తదితరులు పాల్గొన్నారు.

మాలసంఘం మండల అధ్యక్షుడిగా వెంకటేశ్‌

జైపూర్‌: మండల మాలసంఘం అధ్యక్షుడిగా గంగిపల్లి గ్రామానికి చెందిన శీలం వెంకటేశ్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల మాలసంఘం అధ్యక్షుడిగా శీలం వెంకటేశ్‌ను ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు.

దిగుబడి దిగులు

- వరికి అందని చివరి తడులు
- ఎండుతున్న పొలాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు కాటేల చంద్రయ్య. ఎల్లూర్‌ శివారులో రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తున్నాడు. పంట చివరి దశలో నీటి తడులు అందక పంట ఎండిపోతున్న క్రమంలో పొలానికి నీరు అందించడానికి అనేక అవస్థలు పడుతున్నాడు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట నీరు అందక కళ్ల ముందే ఎండిపోతుందని రైతు ఆవేదన చెందుతున్నాడు.


ఎల్లూర్‌లో ఎండిపోతున్న వరి పంట


కాలువకు గండి పడి వృథాగా పోతున్న నీరు

పెంచికల్‌పేట్‌: వానాకాలంలో సాగు చేసిన వరి పంటకు చివరి దశలో నీరు అందక రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. గత నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంట పొలాలు బీటలు బారుతున్నాయి. ప్రస్తుతం పంట గింజ దశలో ఉండగా చివరి తడులను అందించాల్సి ఉంది. పంటకు నీరు లేక దిగుబడులు తగ్గుతాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుమారు 5వేల ఎకరాల్లో..

మండలంలో రైతులు వరి పంటను ప్రాజెక్టు, బోర్లు, మోటార్లు, కాలువల కింద సుమారు 5వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఎల్లూర్‌ బొక్కివాగు ప్రాజెక్టు కింద సుమారు 500 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా కాలువలకు గండ్లు పండి నీరు వృథాగా పోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల నుంచి నీటిని పొలాలకు మళ్లించడానికి ప్రయత్నం చేస్తున్నా కాలువలు సరిగా లేక నీరు పంట పొలాలకు అందడం లేదని రైతులు వాపోతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో నీరు అందక ఎండిపోతుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



బొక్కివాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా పంట పొలాలకు అందడం లేదు. ప్రాజెక్టు కాలువలు కూలిపోవడంతో పాటు కాలువలకు గండ్లు పడ్డాయి. దీంతో కాలువల నుంచి నీరు వృథాగా పోతుంది. పంట పొలాలకు నీటిని మళ్లించడానికి ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి కాలువలకు మరమ్మతులు జరిపించాలి.

– గణపతి, రైతు, అగర్‌గూడ

పత్తి పంట దుమ్ముపాలు!


పత్తి పంటపై చేరిన దుమ్ము


కంకర లేచిన టోకెన్‌మొవాడ్‌ రోడ్డు

కెరమెరి: మండలంలోని మట్టి రోడ్డుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలతో మట్టిరోడ్డుపై దుమ్ము లేచి పత్తి పంటలను కప్పేస్తుంది. దీంతో పత్తి నాణ్యత కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని జోడేఘాట్‌ నుంచి హట్టి వరకు డబుల్‌ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే పలు కారణాలతో టోకెన్‌ మోవాడ్‌ వరకే పనులు పూర్తి చేశారు. మిగిలిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. టోకెన్‌మోవాడ్‌ నుంచి హట్టి వరకు సుమారు 11 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. వాహనాలు ఈ కంకర తేలిన మట్టి రోడ్డుపై రాకపోకలు సాగించినప్పుడు దుమ్ము, ధూళి పక్కనున్న పంటలపై పడడంతో పంటలు దెబ్బ తింటున్నాయి. దీంతో పంటల ఎదుగుదల లోపించి రైతులు నష్టపోతున్నారు. గత కొద్ది రోజులుగా వానలు లేకపోవడం, ఎండలు మండుతుండడంతో పంటలు దెబ్బతినగా మిగిలిన పత్తి పంటకు ధర వస్తుందనుకుంటే దుమ్ము, ధూళితో ధర అనుకున్న స్థాయిలో రాకపోవచ్చని రైతులు వాపోతున్నారు.

నాణ్యత తగ్గే ప్రమాదం..

ఇప్పటికే చాలా చోట్ల రోడ్డుకు ఇరువైపులా ఉన్న పత్తి పొలాల్లో పత్తి పంట పగిలింది. కొన్ని చోట్ల మొక్కలు ఇప్పటికే పిందె దశలో ఉన్నాయి. దీని వల్ల రోడ్డుపై వాహనాలతో లేచే దుమ్ము పగిలిన పత్తిపై పడడంతో పత్తి రంగు మారుతుంది. టోకెన్‌మోవాడ్‌ నుంచి హట్టి వరకు ప్రధానంగా పత్తి పంట సాగు చేశారు. దీనిలో అంతరపంటగా కంది వేశారు. కానీ ప్రస్తుతం దుమ్ము, ధూళీ వల్ల కొంత పంట నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చాలాసార్లు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను వేడుకున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని స్థానికులు పేర్కొంటున్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి



టోకెన్‌మోవాడ్‌ నుంచి హట్టి వరకు నిలిచిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి. అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. మట్టిరోడ్డుపై వాహనాల రాకపోకలతో దుమ్ము లేచి పంటలకు నష్టం కలుగుతుంది.

– పెందోర్‌ రాజేశ్వర్‌, జోడేఘాట్‌

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

కౌటాల: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై ఎస్‌.మధుకర్‌ అన్నారు. ఆదివారం మండలంలోని మొగడ్‌దగడ్‌, వీర్దండి, గుండాయిపేట్‌, తుమ్మిడిహెట్టి, గుడ్లబోరి గ్రామాల్లో పారా మిలిటరీ దళాల ఫ్లాగ్‌మార్చ్‌ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి వర్గభేదాలు లేకుండా అల్లర్లు జరగకుండా సహకరించాలన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని తెలిపారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కవాతులో పోలీసులు పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న ఎస్సై మధుకర్‌, పోలీసులు

రిటర్నింగ్‌ అధికారి కార్యాలయాన్ని పరిశీలించిన డీఎస్పీ

సిర్పూర్‌(టి): సిర్పూర్‌(టి) నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి కార్యాలయాన్ని ఆదివారం కాగజ్‌నగర్‌ డీఎస్పీ కరుణాకర్‌, సిర్పూర్‌(టి) ఎస్సై దీకొండ రమేశ్‌లు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. స్థానిక రిటర్నింగ్‌ కార్యాలయంలో నిర్వహించనున్న ఎన్నికల నామినేషన్‌ కేంద్రాన్ని తహసీల్దార్‌ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించి భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్‌ కార్యాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. వచ్చే నెలలో నిర్వహించనున్న నామినేషన్‌ ప్రక్రియ రిటర్నింగ్‌ కార్యాలయంలో ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు.


కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్సైలు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కెరమెరి: మండల కేంద్రానికి చెందిన సీనియర్‌ ఫొటోగ్రాఫర్‌ కొండే జనార్దన్‌ గత నెలలో అనారోగ్యంతో మృతి చెందగా ఆయన సతీమణి కాశిబాయికి తెలంగాణ రాష్ట్ర ఫొటో, వీడియోగ్రఫీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆదివాసీ భవన్‌లో రూ. 1.45 లక్షల చెక్కును అందజేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్‌, ఆదిలాబాద్‌ జిల్లా అధ్యక్షుడు దోడే అశోక్‌ మాట్లాడుతూ ఈ ఏడాది వివిధ కారణాలతో మృతి చెందిన ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు రూ.5.45 లక్షలు ఆర్థిక సాయం అందజేసినట్లు పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్లు సంఘంలో సభ్యత్వం నమోదు చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో నాయకులు హుస్సేన్‌, శ్రీనివాస్‌గౌడ్‌, శైలేందర్‌, సమీర్‌, రాజేందర్‌, మాధవ్‌రావు తదితరులు ఉన్నారు.


చెక్కు అందజేస్తున్న నాయకులు

గంభీరావుపేటలో వైద్య శిబిరం

తిర్యాణి: మండలంలోని గంభీరావుపేట గ్రామంలో ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న 43 మందిని పరిశీలించి ఏడుగురికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. వారి నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు తరలించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు హర్షవర్ధన్‌ తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపో శ్రీనివాస్‌, వైద్య సిబ్బంది ప్రమీల, రాధ తదితరులు ఉన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొండ గొర్రెపిల్ల అప్పగింత



తిర్యాణి: మండలంలోని నాయకపుగూడ గ్రామపంచాయతీ పరిధిలోని పెర్కపెల్లికి చెందిన గేదెల కాపరులకు ఆదివారం సమీప అటవీ ప్రాంతంలో కొండ గొర్రెపిల్ల కన్పించింది. కాగా వారు కొండ గొర్రెపిల్లను మండల కేంద్రంలోని ఫారెస్టు శాఖ కార్యాలయంలో రేంజ్‌ అధికారి శ్రీనివాస్‌కు అప్పగించారు.

'రఘునాథ్‌కే టికెట్‌ ఇవ్వాలి'

తాండూర్‌: మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ టికెట్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌కే ఇవ్వాలని అధికార ప్రతినిధి చిలు ముల శ్రీ కృష్ణదేవరాయలు కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. మంచిర్యాలలో బీజేపీని బూత్‌ స్థాయి నుంచి బలోపేతం చేసిన ఘనత రఘునాథ్‌దే అన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి, ప్రజల మదిలో నిలిచి ఉన్న రఘునాథ్‌కు పార్టీ టికెట్‌ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలుపొందడం తథ్యమని తెలిపారు.

'నిరుపేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి'

చెన్నూర్‌రూరల్‌: ఆరు నెలలుగా మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలో ప్రభుత్వ అసైన్డ్‌ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్‌ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే వారికి స్థలాలతో పాటు ఇళ్లు కట్టివ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చందు, అవేజ్‌, పోచక్క, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'డ్రైవర్ల సమస్యలు తీర్చకపోతే ఎన్నికల్లో పోటీచేస్తాం'

బెల్లంపల్లి: ఆటో డ్రైవర్ల సమస్యలు తీర్చడానికి ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులు ముందుకు రాకపోతే తాము ఎన్నికల్లో ఓ అభ్యర్థిని పోటీలో నిలబెడతామని బెల్లంపల్లి ఆటో యూనియన్‌ అధ్యక్షుడు కట్ట రాంకుమార్‌ తెలిపారు. ఆటో డ్రైవర్స్‌, ఓనర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుండా ప్రజాప్రతినిధులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డా, ఆటో డ్రైవర్ల బతుకుల్లో ఎలాంటి మార్పు లేకుండా పోయిందని తెలిపారు. ఈ సారి జరిగే ఎన్నికల్లో ఆటో డ్రైవర్ల సమస్యలు తీర్చేందుకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు కృషి చేయాలని డిమాండ్‌ చేశారు. ఎన్నికల్లో మేనిఫెస్టోలో తమ సమస్యలను ప్రస్తావించే పార్టీకి మద్దతు ప్రకటిస్తామన్నారు. లేకపోతే తమలో ఒకరిని పోటీలో నిలబెట్టి సత్తా చాటుతామని స్పష్టం చేశారు. సమావేశంలో ఆటో డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్రా కాలనీ నుంచి పాతబస్టాండ్‌ వరకు పోలీసులు, బెటాలియన్‌ సిబ్బంది ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. రాబోవు ఎన్నికల దృష్ట్యా ప్రజలకు భరోసా కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

నస్పూర్‌: రాబోయే ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌ అన్నారు. పట్టణంలోని సీసీసీ లక్ష్మినగర్‌, ప్రశాంత్‌నగర్‌లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో స్వచ్ఛమైన శుద్ధజలాలను అందిస్తామని తెలిపారు. బీజేపీకి ఓటు వేసి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అనంతరం అల్లూరి సీతారామరాజు నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 200మంది బీజేపీలో చేరగా, వారికి రఘునాథ్‌ బీజేపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఈర్ల సదానందం, ఉపాధ్యక్షుడు సామ్రాట్‌ రమేశ్‌, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కొండ వెంకటేశ్‌, నాయకులు రానవేన శ్రీనివాస్‌, మహేందర్‌ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే అంతిమ లక్ష్యం

కౌటాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే బీఆర్‌ఎస్‌ పార్టీ అంతిమ లక్ష్యమని సిర్పూర్‌ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మండలంలోని నాగేపల్లి, వీర్దండి, గిన్నెలహెట్టి గ్రామాల నుంచి పలువురికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్‌ లక్ష్యమన్నారు. పార్టీ అధినేత కేసీఆర్‌ విడుదల చేసిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తామన్నారు. మూడోసారి బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సిర్పూర్‌ను మరింత అభివృద్ధి చేస్తానని, తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. అలాగే ఇటీవల మృతి చెందిన పలువురు బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ విశ్వనాథ్‌, డీసీఎంఎస్‌ వైస్‌చైర్మన్‌ కుమురం మాంతయ్య, సర్పంచులు రేణుక, నిహారిక, రాందాస్‌, పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావు, నాయకులు రవీందర్‌గౌడ్‌, శ్రీనివాస్‌, జ్యోతిరావు, తదితరులు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

'అధికారులకు చెప్పే అమ్ముతున్నాం'

చింతలమానెపల్లి: 'అధికారులకు చెప్పే అధిక ధరలకు మద్యం అమ్ముతున్నాం' అని చింతలమానెపల్లి మండలంలోని మద్యం దుకాణాల నిర్వాహకులు పేర్కొనడం విమర్శలకు తావిస్తోంది. ఇష్టారాజ్యంగా మద్యం ధరలు పెంచి విక్రయిస్తుండడంపై 'సాక్షి' దినపత్రికలో 'ఇష్టారాజ్యంగా మద్యం ధరల పెంపు' శీర్షికన ఈ నెల 29న వార్త ప్రచురితమైంది. స్పందించిన కాగజ్‌నగర్‌ డివిజన్‌ ఆబ్కారీ శాఖ అధికారులు మద్యం దుకాణాల నిర్వాహకుల నుంచి వివరాలు సేకరించారు. నిబంధనల ప్రకారం మద్యం విక్రయించాలని హెచ్చరించారు. కాగా.. సంబంధిత అధికారులకు మద్యం ధరల పెంపు విషయం ముందే చెప్పినట్లు కౌటాలకు చెందిన ఓ వైన్‌షాపు యజమాని విలేకరులతో పేర్కొనడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు కఠినంగా ఉన్నప్పటికీ మద్యం దుకాణాల నిర్వాహకులకు అవగాహన లేకపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై కాగజ్‌నగర్‌ ఆబ్కారీ శాఖ సీఐ మంగమ్మను వివరణ కోరగా 'మద్యం దుకాణాలు ధరలు పెంచడంపై తనకు ఎలాంటి సమాచారం లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు. సోమవారం దుకాణాలను తనిఖీ చేస్తామని తెలిపారు.

బీఆర్‌ఎస్‌ నాయకుల ప్రచారం

దహెగాం: సిర్పూర్‌(టి) నియోజకవర్గం ఎమ్మెల్యే కోనేరు కోనప్పను మరోసారి గెలిపించాలని బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్‌ ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించడంతో పాటు మరో సారి కారు గుర్తుకు ఓటు వేసి కోనప్పను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల రైతుబంధు సమితీ కన్వీనర్‌ సంతోష్‌గౌడ్‌, సర్పంచు పుప్పాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ రామారావు

బీఆర్‌ఎస్‌ కార్యకర్తల ప్రత్యేక సమావేశం

జైనూర్‌: బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గెలిపించేందుకు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ కనక యాదవరావు, సిర్పూర్‌ (యూ) జెడ్పీటీసీ కోవ అరుణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మూడు మండలాల ప్రతినిధులతో ప్రత్యేక కార్యచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ మేనిఫెస్టోలోని అంశాలు ప్రతీ ఇంటికి చేరవేస్తూ గోడప్రతులు అంటించాలన్నారు. కార్యక్రమంలో మూడు మండలాల అధ్యక్షులు ఇంతియాజ్‌లాలా, ధర్మారావు, ఆత్రం అనిల్‌, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కోవ అరుణ